సాక్షి
జోగులాంబ గద్వాల
మంగళవారం । 12 । మార్చి । 2024



ముగిసిన బ్రహ్మోత్సవాలు
అలంపూర్ ఆలయాల్లో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు సోమవారం ముగిశాయి.
వివరాలు 8లో ▸

రంజాన్ వేళలు
ఇఫ్తార్ 6-31 (మంగళవారం సాయంత్రం)
సహర్ 5-05 (బుధవారం తెల్లవారుజామున)

వాతావరణం
గరిష్టం/కనిష్టం 39.1 /28.4
రోజురోజుకు ఎండతీవ్రత పెరుగుతుంది. అప్పుడప్పుడు చల్లటి గాలులు వీస్తాయి. ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

సమస్యల పరిష్కారానికి కృషి

గద్వాల క్రైం/అయిజ: జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు 5 ఫిర్యాదులు అందాయి. వివిధ మండలాలకు చెందిన వారు తమ గోడును ఎస్పీ రితిరాజ్ ఎదుట వెళ్లబోసుకున్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. ఆయా సమస్యలపై విచారణ చేపట్టి న్యాయం చేస్తామని, సివిల్ సమస్యలను కోర్టు ద్వారా పరిష్కారం చేసుకోవాలిన అన్నారు.

నేరుగా సంప్రదించండి ఎస్పీ

అయిజ పోలీసు స్టేషన్ పరిధిలోని ప్రజలు ఈ నెల 13వ తేదిన తమను నేరుగా సంప్రదించవచ్చని ఎస్పీ రితిరాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం అయిజ పోలీసు స్టేషన్‌ను సందర్శించనున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రానికి రాలేని ఫిర్యాదుదారులు అయిజ పోలీస్ స్టేషన్‌లో తనను నేరుగా కలిసి సమస్యలను తెలియజేయాలని తెలిపారు.

గద్వాల డీటీఓగా వెంకటేశ్వరరావు



గద్వాల క్రైం: జిల్లా రవాణాశాఖ అధికారిగా పీవీ వెంకటేశ్వరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో టాక్స్ చెల్లించని వాహనదారులను గుర్తించి సకాలంలో టాక్స్‌లు చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. అంతర్రాష్ట్ర సరిహద్దుల అనుమతి, పన్నులు చెల్లించకుండా తిరుగుతున్న వాహనాలు సీజ్ చేస్తామన్నారు. వాహనాల సామర్థ్యం, ఇన్సూరెన్స్, నంబర్ ప్లేట్ తదితర వాహనాలు రోడ్డు నిబంధనలు, రవాణశాఖ అనుమతి లేని వాహనాలను ఎట్టి పరిస్థితిలో ఉపేక్షించేది లేదన్నారు. జిల్లా కార్యాలయంలో వివిధ సేవల కోసం వచ్చే వారు దళారులను ఆశ్రయించకుండా నేరుగా అధికారులను సంప్రదించాలన్నారు. అవినీతికి తావివ్వకుండా విధులు నిర్వహిస్తామన్నారు. ఇదిలాఉండగా, ఇక్కడ విధులు నిర్వహిస్తున్న డీటీఓ పురుషోత్తం రెడ్డి హైదరాబాద్‌కు బదిలీపై వెళ్లారు.

వివరాలు బహిర్గతపర్చాలి


గద్వాల అర్బన్: సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం ఎలక్టోరల్ బాండ్ల వివరాలను బహిర్గత పర్చాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంకు ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎలక్టోరల్ బాండ్ల ద్వారా విరాళాల సేకరణ రాజ్యాంగ విరుద్ధమన్నారు. సుప్రీం కోర్టు ఎలక్టోరల్ విధానాన్ని రద్దు చేసి, కార్పొరేట్ దాతల వివరాలను బహిరంగ పర్చాలని ఆదేశాలు జారీ చేసిందని, ఈ నెల 6తో గడువు ముగిసిందన్నారు. కానీ బ్యాంకు ఇంకా మూడు నెలల గడువు కావాలని కోర్టులో పిటిషన్ దాఖలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అనంతరం బ్యాంకు మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఉప్పేరు నర్సింహ్మా, బాలకృష్ణ, రఘు, ఆంజనేయులు, గరేంద్ర, విష్ణు, రాజు తదితరులు ఉన్నారు.

లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయ హుండీ లెక్కింపు



జడ్చర్ల టౌన్: మండలంలోని గంగాపురం లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో సోమవారం హుండీ లెక్కింపు నిర్వహించారు. ఫిబ్రవరిలో ఆలయంలో బ్రహ్మోత్సవాలు నిర్వహించగా.. భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించగా రూ.14,80,399 ఆదాయం వచ్చిందని ఈఓ దీప్తిరెడ్డి తెలిపారు. దేవాదాయశాఖ పర్యవేక్షకులు వీణాధరి సమక్షంలో హుండీ లెక్కింపు కొనసాగింది.

రేపటి నుంచి మైసమ్మ దేవాలయ వార్షికోత్సవాలు



నవాబుపేట: అడవి తల్లికి భక్తి శోభ రానుంది. ప్రతి ఆది, మంగళవారాలు భక్తులతో నిండిపోయే అడవి తాజాగా వార్షికోత్సవ కార్యక్రమాల్లో రెండు రోజులు కిటకిటలాడనుంది. మండలంలో ప్రసిద్ధి చెందిన పర్వతాపూర్ మైసమ్మ దేవాలయ వార్షికోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు ఆలయ చైర్మన్ కృష్ణయ్య, దేవాలయ అధికారి మదనేశ్వర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ధ్వజారోహణం, గణపతి పూజ, గురువారం కుంకుమార్చన, హోమం నిర్వహిస్తున్నట్లు వారు వివరించారు.

నామినేషన్ల ఘట్టం ముగిసింది

16 మంది అభ్యర్థులు దాఖలు

- 14వ తేదీ వరకు ఉప సంహరణకు గడువు
- ఉమ్మడి జిల్లాలో 10 పోలింగ్ కేంద్రాలు.. 1,439 మంది ఓటర్లు
- ఈ నెల 28న పోలింగ్, ఏప్రిల్ 2న కౌంటింగ్
- ఏర్పాట్లు ముమ్మరం చేసిన యంత్రాంగం



రిటర్నింగ్ అధికారి రవినాయక్‌కు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి మన్నె జీవన్‌రెడ్డి, చిత్రంలో వంశీచంద్‌రెడ్డి, కొత్వాల్ తదితరులు



నామినేషన్ పత్రాలు అందజేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి నవీన్‌కుమార్‌రెడ్డి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల శాసన మండలి ఉపపోరులో నామినేషన్ల ఘట్టం సోమవారంతో ముగిసింది. దీంతో ఎన్నికల ప్రక్రియలోని మొదటి అంశం పూర్తి కావడంతో క్షేత్రస్థాయిలో ఉప ఎన్నికల పోరు మొదలైంది. ఈ ఎన్నికల్లో ప్రధాన పార్టీలతోపాటు స్వతంత్రులు సైతం పోటీ పడుతున్నారు. సోమవారంతో నామినేషన్ల ప్రక్రియ ముగిసిన నేపథ్యంలో ఓటర్లను మచ్చిక చేసుకునే పనిలో అభ్యర్థులు నిమగ్నమయ్యారు. ప్రధాన రాజకీయ పార్టీల నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థులు ఇప్పటికే స్థానిక సంస్థల ప్రతినిధులకు టచ్‌లోకి వెళ్లగా.. స్వతంత్రులు హక్కులు, నిధుల కేటాయింపులో జరుగుతున్న అన్యాయాన్ని ఎత్తిచూపుతూ ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలోనే ప్రధాన రాజకీయ పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల అభ్యర్థులు ఓటర్లను క్యాంపులకు తరలించే ఏర్పాట్లు సైతం చేసినట్లు తెలుస్తోంది. నామినేషన్ల ఘట్టం ముగిసే సమయానికి 16 మంది అభ్యర్థులు తమ నామినేషన్లు వేశారు. ఈ నెల 14న నామినేషన్ల ఉపసంహరణ అనంతరం పోటీలో నిలిచే అభ్యర్థులు ఎవరనేది తేలనుంది. ఈ నెల 28న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జిల్లాలో ఏర్పాటు చేసిన 10 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ఉంటుంది. స్థానిక సంస్థల ఉపపోరులో 644 మంది పురుషులు, 795 మంది మహిళా ఓటర్లు కలిపి మొత్తం 1,439 మంది ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఉప ఎన్నికల్లో పురుషుల కంటే మహిళా ఓటర్లే ఎక్కువగా ఉండటం గమనార్హం.

చివరిరోజు హోరాహోరీగా..

మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఉప ఎన్నికలో భాగంగా నామినేషన్ల స్వీకరణ సోమవారం ముగిసింది. ఈ నెల 4న ప్రారంభమైన నామినేషన్ల ప్రక్రియలో అభ్యర్థులు ముహూర్తాలు చూసుకొని చివరి రోజుకే ప్రాధాన్యత ఇచ్చారు. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులతోపాటు స్వతంత్రులు సైతం నామినేషన్లు దాఖలు చేశారు. ప్రధానంగా కాంగ్రెస్ నుంచి మన్నె జీవన్‌రెడ్డి, బీఆర్ఎస్ నుంచి ఎన్.నవీన్‌రెడ్డి మూడు సెట్ల చొప్పున నామినేషన్లు దాఖలు చేయగా.. మిగతా స్వతంత్రులు తమ నామినేషన్లు దాఖలు చేశారు. సమయం ముగిసే వరకు 16 మంది అభ్యర్థులు సమర్పించగా.. మొత్తం 28 సెట్ల నామినేషన్లు దాఖలయ్యాయి. చివరి రోజే 15 మంది 26 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు.

నామినేషన్ల దాఖలు ఇలా..

అభ్యర్థి పేరు	పార్టీ	సెట్లు
మన్నె జీవన్‌రెడ్డి	కాంగ్రెస్	03
ఎన్.నవీన్ కుమార్‌రెడ్డి	బీఆర్ఎస్	03
మున్నూర్ రవి	స్వతంత్ర	01
గడీల కుమార్‌గౌడ్	స్వతంత్ర	02
ఎస్.కృష్ణ	స్వతంత్ర	02
గవినోళ్ల బలరాంరెడ్డి	స్వతంత్ర	01
విజయ్ మంగి	స్వతంత్ర	04
పి.సుమలత	స్వతంత్ర	01
ఎం.శంకర్‌నాయక్	స్వతంత్ర	01
లక్ష్మీరెడ్డి నాగరకుంట	స్వతంత్ర	02
సుదర్శన్ గౌడ్	స్వతంత్ర	02
మహ్మద్ రహీం ఖాన్	స్వతంత్ర	01
శ్రీకాంత్ పిల్లెల	స్వతంత్ర	01
దేవి రవీందర్	స్వతంత్ర	02
ఆర్.జీవన్‌రెడ్డి	స్వతంత్ర	01
సుధాకర్‌రెడ్డి	స్వతంత్ర	01

పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల వివరాలిలా..

పోలింగ్‌స్టేషన్	పురుష ఓటర్లు	మహిళా ఓటర్లు	మొత్తం
ఎంపీడీఓ కార్యాలయం, మహబూబ్‌నగర్	117	128	245
ఎంపీడీఓ కార్యాలయం, కొడంగల్	27	29	56
ఎంపీడీఓ కార్యాలయం, నారాయణపేట	89	116	205
ఆర్డీఓ ఆఫీస్, వనపర్తి	99	119	218
జెడ్పీ కార్యాలయం, జోగులాంబ గద్వాల	91	134	225
బాలికల జూనియర్ కళాశాల, కొల్లాపూర్	28	39	67
బాలుర జెడ్పీహెచ్ఎస్, నాగర్‌కర్నూల్	48	53	101
బాలికల జెడ్పీహెచ్ఎస్, అచ్చంపేట	37	42	79
ప్రభుత్వ జూనియర్ కళాశాల, కల్వకుర్తి	31	41	72
ఎంపీడీఓ కార్యాలయం, షాద్‌నగర్	77	94	171
మొత్తం	644	795	1,439

భారత పార్లమెంట్ వ్యవస్థ గొప్పది



సరస్వతీదేవి చిత్రపటం వద్ద జ్యోతి వెలిగిస్తున్న అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు

గద్వాల రూరల్: భారత పార్లమెంట్ వ్యవస్థ ప్రపంచంలోనే గొప్పదని అదనపు కలెక్టర్ ముసిని వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎంఎల్‌డీ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో నైబర్ హుడ్ యూత్ పార్లమెంట్ అనే అంశంపై నెహ్రూ యువజన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన మాక్‌పార్లమెంట్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ యొక్క విశిష్టతను, విధివిధానాలు, బాధ్యతలను విద్యార్థులకు వివరించారు. అనంతరం మాక్‌పార్లమెంట్ కార్యక్రమంలో ప్రతిభను కనబర్చిన విద్యార్థులకు మెమెంటోలను, ధృవపత్రాలను అందజేశారు. ఈకార్యక్రమంలో కాలేజి ప్రిన్సిపల్ కళాందర్‌బాష, నెహ్రూయువజన కేంద్ర జిల్లా అధికారి కోటనాయక్, వైస్ ప్రిన్సిపల్ శ్రీపతినాయుడు, అధ్యాపక బృందం, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

వేరుశనగ క్వింటా రూ.6,606

గద్వాల వ్యవసాయం: గద్వాల మార్కెట్‌యార్డుకు సోమవారం 1227 క్వింటాళ్ల వేరుశనగ రాగా, గరిష్టం రూ.6606, కనిష్టం రూ.3811, సరాసరి రూ. 5400 ధరలు పలికాయి. అలాగే, 248 క్వింటాళ్ల ఆముదం రాగా గరిష్టం రూ. 5679, కనిష్టం రూ. 2369, సరాసరి రూ. 5669 ధరలు వచ్చాయి. 59 క్వింటాళ్ల కంది రాగా గరిష్టం రూ. 9528, కనిష్టం రూ. 6000, సరాసరి రూ. 7000 ధరలు పలికాయి.

బీఆర్ఎస్ పాలనలో స్థానిక సంస్థలు నిర్వీర్యం



మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు, చిత్రంలో అభ్యర్థి జీవన్‌రెడ్డి, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎమ్మెల్యేలు రాజేష్‌రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, వీర్లపల్లి శంకర్, వాకిటి శ్రీహరి, మేఘారెడ్డి

రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

స్టేషన్ మహబూబ్‌నగర్: స్థానిక సంస్థలను బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా మన్నె జీవన్‌రెడ్డి సోమవారం జిల్లాకేంద్రంలోని ఐడీఓసీ బిల్డింగ్‌లోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో రిటర్నింగ్ అధికారికి నామినేషన్ సమర్పించారు. అనంతరం కార్యాలయ ఆవరణలో మంత్రి జూపల్లి, ఎమ్మెల్సీ అభ్యర్థి మన్నె జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యేలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు ఆస్తులు అమ్ముకొని, అప్పులు తెచ్చి పనులు చేస్తే గత ప్రభుత్వం వారికి బిల్లులు కూడా చెల్లించలేదన్నారు. ధనిక రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చిందని ఆరోపించారు. బీఆర్ఎస్ నియంత, రాచరిక పాలనకు వ్యతిరేకంగా ఇటీవలే జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు స్పష్టంగా తీర్పు ఇచ్చి కాంగ్రెస్‌ను గెలిపించారన్నారు. అదే మాదిరిగా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారీ మెజార్టీతో మన్నె జీవన్‌రెడ్డి గెలుస్తారని ఆశించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో రెండు స్థానాలను కూడా కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందన్నారు. బడుగు, బలహీన వర్గాలకు మేలు చేసేది కాంగ్రెస్ పార్టీనే అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో మూడు నెలల్లోనే ఆరు గ్యారంటీ పథకాల్లో ఇప్పటికే నాలుగు అమలు చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రజాపాలన నను చూసి స్థానిక సంస్థల ప్రతినిధులు కాంగ్రెస్ అభ్యర్థికి ఓటు వేసి గెలిపిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు

ఎమ్మెల్సీ అభ్యర్థి మన్నె జీవన్‌రెడ్డి మాట్లాడుతూ స్థానిక సంస్థల కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా అవకాశం కల్పించిన మల్లికార్జున్ ఖర్గే, సోనియా, రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులు, కౌన్సిలర్ల మద్దతు, ఆశీ రాదంతో స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా గెలుపొందుతాననే నమ్మకం ఉందన్నారు. అంతకు ముందు విలేకరులతో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీలకతీతంగా స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు కాంగ్రెస్‌కు పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఆనాడు టీఆర్ఎస్ పేరుతో గెలిచిన నాయకులకు బీఆర్ఎస్‌గా మారినప్పుడే తెలంగాణతో పేగుబంధం తెగిపోయిందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి, మాజీ ఎంపీ మల్లురవి, గద్వాల జెడ్పీ చైర్‌పర్సన్ సరిత, ఎమ్మెల్యేలు జి.మధుసూదన్‌రెడ్డి, రాజేష్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, వంశీకృష్ణ, వీర్లపల్లి శంకర్, మేఘారెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ ఉన్నారు.

'మండలికి పంపుతారనే నమ్మకం ఉంది'



మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి నవీన్‌కుమార్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, విజయుడు

స్టేషన్ మహబూబ్‌నగర్: 'నేను ప్రజల గొంతకను, అందువల్ల శాసనమండలికి పంపుతారనే నమ్మకం ఉంద'ని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నవీన్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ పార్టీ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా నవీన్‌రెడ్డి కలెక్టరేట్‌లోని సోమవారం రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో రిటర్నింగ్ అధికారికి నామినేషన్ అందజేశారు. అనంతరం కార్యాలయ ఆవరణలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించినందుకు కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్ఎస్‌కు 900కుపైగా ఎంపీటీసీలు, జెడ్పీటీసీ సభ్యులు, కౌన్సిలర్లు ఉన్నారని, వాళ్లు ఎన్ని డబ్బులు చూపి ప్రలోభాలకు గురిచేసినా ఎవరూ కూడా లొంగరన్నారు. తెలంగాణవాదం ఎలాంటిదో ఈ ఎన్నికల్లో నన్ను గెలిపించి చూపించబోతున్నారని అన్నారు. నేను రైతుబిడ్డగా రాజకీయాల్లో వచ్చానని.. ఉపసర్పంచ్, జెడ్పీటీసీ, జెడ్పీ వైస్‌చైర్మన్ పనిచేసిన చేసిన అనుభవం ఉందన్నారు. స్థానిక సంస్థల ప్రతినిధుల్లో ఎలాంటి అసంతృప్తి లేదని, మా సంఖ్యాబలం, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేల సహకారంతో కచ్చితంగా గెలుస్తానని చెప్పారు. గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా నవీన్‌రెడ్డి గెలుపు తథ్యమన్నారు. కౌరవులు ఎంత మందో, పాండవులు ఎంత మందో అందరికీ తెలుసని, చివరగా విజయం పాండవులకే వరించిందన్నారు. ఎవరు ఎన్ని ప్రలోభాలు పెట్టినా బీఆర్ఎస్ అభ్యర్థిదే విజయం అన్నారు. కార్యక్రమంలో అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, గద్వాల మున్సిపల్ చైర్మన్ కేశవులు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి



గ్రామస్తులతో కలిసి ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ అపూర్వ్‌చౌహాన్

రాజోళి: ప్రభుత్వ నిబంధనలకు పాతరేసి ఇసుక రవాణాకు పాల్పడుతున్నారని, ఈ రవాణాను అరికట్టండి సార్ అని మండలంలోని తుమ్మిళ్ల గ్రామస్తులు సోమవారం ఆకస్మికసంగా గ్రామాన్ని సందర్శించిన అడిషనల్ కలెక్టర్ అపూర్వ చౌహాన్‌కు విన్నవించారు. వివరాల్లోకి వెళితే తుమ్మిళ్ల గ్రామంలో టీఎస్ఎండీసీ ఆధ్వర్యంలో ఇసుక తవ్వకాలు చేసుకునేందుకు ప్రభుత్వం గతంలో అనుమతులు ఇచ్చింది. ఈ మేరకు ఇక్కడ రీచ్ ఏర్పాటు చేశారు. అంతవరకు బాగానే ఉన్నా..నిబంధనల్లో ఉన్న ప్రకారం ఇసుక రవాణా జరగడం లేదని గ్రామస్తులు గత కొద్ది రోజులుగా ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో పలుమార్లు ఇసుక తరలిస్తున్న టిప్పర్లను సైతం అడ్డుకున్నారు. గత వారంలో తవ్వకాలు జరుగుతున్న దగ్గరకు వెళ్లి పనులను పూర్తిగా నిలిపేశారు.

అడిషనల్ కలెక్టర్ ఆరా..

ఈక్రమంలో అడిషనల్ కలెక్టర్ తుమ్మిళ్లను సందర్శించారు. అనుమతులున్నప్పటికీ రీచ్ వద్ద పనులు ఎందుకు ఆపుతున్నారని ఆయన గ్రామస్తులను అడిగారు. అనుమతులు ఉన్నప్పటికీ వారు నిబంధనలు అతిక్రమించి సామర్థ్యానికి మించి ఇసుక లోడ్ నింపుకుని వెళ్లడంతో రోడ్లన్నీ గుంతలమయంగా మారుతున్నాయని గ్రామస్తులు ఆయనకు తెలిపారు. రీచ్ వద్ద స్థానికులకు పనులు కల్పించడం లేదని వీటన్నింటిపై దృష్టి సారించాలని వారు అడిషనల్ కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు.

మార్మోగిన శివనామస్మరణ



రథోత్సవానికి హాజరైన భక్తులు

- కనులపండువగా ఆదివేశ్వరస్వామి రథోత్సవం
- భారీగా తరలివచ్చిన భక్తజనం



ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే విజేయుడు

రాజోళి: మండల కేంద్రంలో సోమవారం భ్రమరాంబ ఆదివేశ్వర స్వామి రథోత్సవం కనులపండువగా జరిగింది. రాజోళి,వడ్డేపల్లి మండలాలతో పాటు,రాష్ట్రంలోని ఆయా ప్రాంతాలు, కర్ణాటక, ఏపీలోని పలు జిల్లాల నుండి భక్తులు వేల సంఖ్యలో హాజరయ్యారు. భక్తుల శివనామస్మరణతో రాజోళి మార్మోగగా, అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, అలంపూర్ ఎమ్మెల్యే విజేయుడు రథాన్ని లాగి జాతర ఉత్సవాలను ప్రారంభించారు. రథశాల నుండి ఆంజనేయస్వామి ఆలయం వరకు రథాన్ని లాగారు. ఈ క్రమంలో బాణాసంచా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అంతకు ముందు గ్రామ పెద్దలు ఆలయంలో స్వామి అమ్మవార్లకు విశేష పూజలు, అర్చనలు,అభిషేకాలు నిర్వహించారు. ఉత్సవాలు ప్రారంభం కాగానే స్థానికంగా వెలిసిన దుకాణాలు తెరుచుకున్నాయి.

ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం



మాట్లాడుతున్న ఆర్ఎం వి.శ్రీదేవి

స్టేషన్ మహబూబ్‌నగర్: ఉమ్మడి జిల్లాలో ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని రీజినల్ మేనేజర్ వి.శ్రీదేవి అన్నారు. జిల్లా కేంద్రంలోని పారిశ్రామికవాడ ఫోరం కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సర్వసభ్య సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జిల్లా పరిధిలోని వివిధ డిపోలకు చెందిన కారుణ్య నియామకాలను త్వరలో చేపడుతామని, విశ్రాంత ఉద్యోగులకు మందుల కొరత లేకుండా తగు చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలో నాగర్‌కర్నూల్ డివిజన్ పాలెంలో మరో ఆర్టీసీ క్లినిక్‌ను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. పర్సనల్ ఆఫీసర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రీజియన్ పరిధిలోని విశ్రాంత ఉద్యోగులకు ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకురావాలని, వెంటనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం విశ్రాంత ఉద్యోగుల జీవితకాలం ప్రయాణపు గుర్తింపు కార్డులను ఆర్ఎం అందజేశారు. సమావేశంలో ఫోరం జిల్లా అధ్యక్షులు రాజసింహుడు, లక్ష్మణ్‌గౌడ్, నారాయణ, ఉమేష్ కుమార్, భగవంతు, నాగాంజనేయులు, మోహన్ రెడ్డి, బీహెచ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం


జంగయ్య (ఫైల్)

చారకొండ: రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న ఓ వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో మృతిచెందిన సంఘటన ఆదివారం అర్ధ రాత్రి మండలంలోని జూపల్లి సమీపంలో ప్రధాన రహదారిపై చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మండలంలోని సిర్సనగండ్లకు చెందిన బచ్చనమోని జంగయ్య(42) ఆదివారం జూపల్లిలోని బంధువుల ఇంటికి వచ్చి రాత్రి సమయంలో స్వగ్రామానికి రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన జంగయ్యను స్థానికులు గమనించి బంధువులు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు వచ్చి అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. సమాచారం మేరకు సంఘటనా స్థలాన్ని చారకొండ పోలీసులు పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై జంగయ్య భార్య జంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

డీసీఎం ఢీ: వ్యక్తి మృతి

మహబూబ్‌నగర్ క్రైం: ద్విచక్ర వాహనాన్ని డీసీఎం ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎదిరకు చెందిన కావాలి వెంకటయ్య(48) సోమవారం రాత్రి జడ్చర్ల నుంచి ఎదిరకు ద్విచక్ర వాహనంపై వస్తుంటే మార్గమధ్యలో చిట్టిబోయిన్‌పల్లి గ్రామ శివారులోని జాతీయ రహదారిపై డీసీఎం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య సైతం ఇటీవల గుండెపోటుతో మృతి చెందింది. దీంతో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడికి ఇద్దరూ పిల్లలు ఉండగా.. ఒక అమ్మాయికి పెళ్లి అయింది. మరో అమ్మాయి ఇంటర్ చదువుతుంది.

జాతరకు వచ్చి మహిళ..

బిజినేపల్లి: మండలంలోని కుమ్మెర జాతరకు వచ్చిన ఓ మహిళ అకస్మాత్తుగా మృతిచెందింది. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. తాడూరు మండలంలోని చర్లతిర్మలాపూర్ గ్రామానికి చెందిన బోనాసి మంగమ్మ(48) ఆదివారం సాయంత్రం కుమ్మెర జాతరలో మల్లన్నస్వామి దర్శనానికి వచ్చింది. ఆదివారం రాత్రి స్వామివారి సన్నిధి చెంతనే నిద్రించింది. సోమవారం తెల్లావారుజామున తోటి భక్తులకు మంగమ్మ అపస్మారక స్థితిలో కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు వచ్చి విచారణ చేపట్టారు. జాతర కోసం వచ్చి అస్వస్థతతో మృతిచెందినట్లు ఎస్‌ఐ నాగశేఖర్‌రెడ్డి తెలిపారు. మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించామని చెప్పారు.

కాల్వలో పడి మహిళ..

గోపాల్‌పేట: అనుమానాస్పదంగా కాల్వలో పడి మహిళ మృతి చెందిన ఘటన రేవల్లి మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. రేవల్లి మండలంలోని శానాయిపల్లికి చెందిన లక్ష్మమ్మ (50) ఒంటరిగా జీవిస్తుంది. ఆమె భర్త, కుమారుడు ఇద్దరు మృతి చెందాడు. ఆదివారం గట్టు మల్లయ్య జాతర ఉండగా బయటికి వచ్చి తిరిగి ఇంటికి వెళ్లలేదు. సోమవారం ఉదయం కాల్వలో పడి పోయిందని కుటుంబసభ్యులకు సమాచారం రావడంతో వారు వెళ్లారు. అనుమానాస్పదస్థితిలో మృతి చెందడంతో పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పీఎల్‌ఐ కాల్వలో పడి చనిపోయినందున తమకు నష్టపరిహారం ఇవ్వాలని కుటుంబ సభ్యులు నిరసన తెలిపారు. సోమవారం రాత్రి వరకు మృతదేహాన్ని బయటకు తీయనివ్వలేదు. కాల్వలో ఎలా పడి మరణించిందో తమకు తెలియదని శోధా, కేఎన్‌ఆర్ కంపెనీ అధికారులు చెప్పారు. ఘటనా స్థలాన్ని సీఐ నాగభూషణ్‌రావు పరిశీలించారు.

బావిలో పడి వ్యక్తి..

వంగూరు: కల్వకుర్తి మండలం రఘుపతిపేటకు చెందిన రాముడు (36) ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి మృతిచెందాడు. వంగూరు ఎస్‌ఐ మహేందర్ వివరాల మేరకు.. రఘుపతిపేటకు చెందిన రాముడు ఈనెల 8న మహాశివరాత్రి సందర్భంగా అత్తగారి గ్రామమైన రంగాపూర్‌కు వచ్చాడు. సాయంత్రం తిరిగి ఇంటికి వెళ్తున్నట్లు చెప్పి బయల్దేరాడు. అతడు 9వ తేదీ ఉదయం వరకు ఇంటికి చేరుకోకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రంగాపూర్ శివారులోని వ్యవసాయ బావిలో రాముడు మృతదేహం లభ్యమైందని.. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు పేర్కొన్నారు. మృతుడికి భార్య జ్యోతితో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

పాము కాటుతో వ్యక్తి..

రాజాపూర్: పాముకాటుతో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని మల్లేపల్లిలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ రవి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బ్యాగరి పరశురాములు (40) ఆదివారం రాత్రి ఇంటి వద్ద నిద్రిస్తున్న సమయంలో ఏదో కరిచినట్లు అనిపించి కుమారుడికి చెప్పాడు. కుమారుడు ఇంట్లో పరిశీలించగా పాము కనిపించడంతో దాన్ని చంపారు. తండ్రిని చికిత్స నిమిత్తం పాలమూరు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ముగిసిన శివరాత్రి బ్రహ్మోత్సవాలు


మహా పూర్ణాహుతి నిర్వహిస్తున్న ఈఓ, జడ్జి దంపతులు, ఆలయ సిబ్బంది

పూర్ణాహుతితో పరిసమాప్తి పలికిన అర్చకులు

- శేషవాహనంపై ఊరేగిన దేవతామూర్తులు
- ధ్వజ అవరోహణంలో పాల్గొన్న న్యాయమూర్తి

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ ఆలయాల్లో ఈ నెల 7న ప్రారంభమైన మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు సోమవారం పూర్ణాహుతితో ముగిశాయి. చివరిరోజు ఆలయ ఈఓ పురేందర్‌కుమార్, పాలకమండలి చైర్మన్ చిన్నకృష్ణయ్య, ఆలయ అర్చకులు, ధర్మకర్తలు, సిబ్బంది వసంతోత్సవంలో భాగంగా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకొని సంబురాలు జరుపుకొన్నారు. అనంతరం శేషవాహనంపై దేవతామూర్తుల ఉత్సవ విగ్రహాలు ఉంచి వీధుల్లో ఊరేగించారు. భక్తులు కొబ్బరికాయలు కొడుతూ స్వాగతం పలికి భక్తిని చాటుకున్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన సేవ మధ్యాహ్నం 12 గంటలకు ఆలయానికి చేరుకుంది. అనంతరం ఆలయ ప్రాంగణంలోని ప్రత్యేక యాగశాల మండపంలో కూష్మాండ బలిహరణం చేశారు. అలాగే ఆలయం చుట్టూ ఉత్సవ బలిభేరితో అష్టదిక్పాలక బలిహరణం నిర్వహించారు. ఇదిలా ఉండగా యాగశాలలో ఆవాహిత దేవతా మండపాలకు ప్రత్యేక పూజలు, నివేదనలు చేసిన అనంతరం 108 ద్రవ్యాలతో మహా పూర్ణాహుతి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి కమలాపురం కవిత కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. పూర్ణాహుతి తర్వాత ప్రధాన ఆలయంలో కొలువుదీరిన మూలమూర్తులకు యాగరక్షను అందజేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అదేవిధంగా యాగశాలతో పాటు బాలాలయంలో ఉన్న కలశాలను ఉద్వాసన చేసి కలశాలు, ఉత్సవ బలిభేరి, ఉత్సవమూర్తులను ఊరేగింపుగా నాగకన్యకల బావి దగ్గరకు చేర్చారు.

ధ్వజ అవరోహణం..

ఉత్సవాల ముగింపులో భాగంగా ఆలయ ప్రాంగణంలో ధ్వజ పతాకాన్ని కిందికి దించారు. ఈ సందర్భంగా పండితులు ఆగమోక్తంగా క్రతువును నిర్వహించారు. ధ్వజ అవరోహణంతో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు సంపూర్ణమయ్యాయి. అనంతరం దేవతామూర్తులను పల్లకీలో గర్భాలయంలోకి చేర్చి మహా నివేదన, దశవిధ హారతులు ఇచ్చారు. అనంతరం ఆలయ ఈఓ మాట్లాడుతూ.. ఈ ఏడాది ఉత్సవాలు ఎంతో వైభవంగా జరిగాయని.. అన్నిశాఖల అధికారులు, స్థానికులు, ఆలయ అర్చకులు, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా గ్రామస్తులను ఆలయానికి ఆహ్వానించి అన్నదానం చేశారు.

ఘనంగా తీర్థవళి..

నాగకన్యకల బావి దగ్గర దేవతామూర్తుల విగ్రహాలకు మృత్తికాస్నానం, పంచామృతాలతో అభిషేకాలు, పంచసూక్తాలు పఠిస్తూ బావిలోని జలాలతో అభిషేకాలు చేశారు. మహిళలంతా పాలికలను బావిలో వదిలిన తరువాత దేవతామూర్తుల విగ్రహాలను బావిలోకి తీసుకెళ్లి పుణ్యస్నానాలు చేయించారు. దీన్నే తీర్థావళి, త్రిశూల బలిభేరి స్నానాలని అంటారని.. ఈ నీటిలో ముందుగా దేవతాస్నానం తర్వాత యతీస్నానం, రాజస్నానం, ప్రజలు స్నానాలు చేయాలని ఆలయ అర్చకులు సూచించారు. దీంతో భక్తులంతా అక్కడే పుణ్యస్నానాలు చేశారు.


నాగకన్యకల బావిలో దేవతామూర్తుల విగ్రహాలతో స్నానాలు

మాహె రంజాన్ ప్రారంభం


మహబూబ్‌నగర్‌లో రహెమానియా ఈద్గా

- నేటి నుంచే ఉపవాసాలు
- దివ్యఖురాన్ అవతరించిన పవిత్ర మాసం
- మసీదుల్లో ప్రారంభమైన తరావీ నమాజ్

స్టేషన్ మహబూబ్‌నగర్: ముస్లింలు అత్యంత పవిత్రంగా భావించే రంజాన్ మాసం సోమవారం రాత్రి నెలవంక దర్శనమివ్వడంతో ప్రారంభమైంది. ఇస్లామియా క్యాలెండర్ ప్రకారం 9వ మాసమైన రంజాన్ ప్రారంభ సూచికంగా మసీదుల్లో సైరన్‌లు మోగాయి. ముస్లింలు ఉపవాసాలను మంగళవారం తెల్లవారుజాము నుంచి ప్రారంభించారు. ప్రత్యేక ప్రార్థనలకు మసీదులన్నీ విద్యుత్ కాంతులతో ముస్తాబయ్యాయి. రంజాన్ నెలలోనే పవిత్ర గ్రంథం దివ్యఖురాన్ అవతరించిందని ఇస్లాం మతస్తుల ప్రగాఢ నమ్మకం. ఉపవాస దీక్షలు ప్రతి ముస్లింపై విధిగా నిర్ణయమై ఉన్నాయని ఖురాన్‌లో పేర్కొనడం వల్ల ప్రాపంచిక జ్ఞానం తెలిసిన వారందరూ ఉపవాస దీక్షలు ఉంటారు. ఇంత పవిత్రమైన ఈనెలలో చేసే ప్రతి పుణ్య కార్యానికి 70రెట్ల ప్రతిఫలం లభిస్తుందని విశ్వసిస్తారు. ఉపవాస దీక్షల (రోజా) వల్ల దైవభీతి, పాప భయం జనిస్తుందని దైవవాణి పేర్కొనడంతో ముస్లింలు అత్యంత భక్తి ప్రపత్తులు, కఠోర ఉపవాస దీక్షలను పాటిస్తారు.

ప్రత్యేక తరావీహ్ నమాజ్..

ఈ మాసంలో ఉపవాసంతోపాటు ప్రత్యేక తరావీహ్ నమాజ్‌కు ఎంతో ప్రాధాన్యత ఉంటుంది. మసీదుల్లో హఫీజ్‌లు ఖురాన్‌ను పఠిస్తారు. సోమవారం రాత్రి నుంచి నెల రోజులపాటు ప్రతిరోజు రాత్రివేళ మసీదుల్లో, ఇళ్ల వద్ద 20 రకాత్‌ల ప్రత్యేక తరావీహ్ నమాజ్ ప్రార్థనలు చేస్తారు. ముస్లింలు ఖురాన్‌ను పఠించి, విని అనంతమైన భావజాలంలో ఓలలాడి తరిస్తారు. కొన్ని మసీదుల్లో 10 రోజులపాటు ప్రతి రోజు ఖురాన్‌లోని మూడు పారాలు పఠించడానికి ఏర్పాటు చేశారు.

ఉపవాస దీక్ష విశేషాలు..

రంజాన్ మాసంలో 30 రోజులు ఉపవాస దీక్షలు పాటించాలి. సూర్యోదయం కంటే ముందే నిర్ధారిత సమయంలో ఆహార పానీయాలు తీసుకోవాలి. దీనిని 'సహర్' అంటారు. సూర్యాస్తమ సమయంలో ప్రతి రోజు కొన్ని నిమిషాల తేడాతో ఉపవాస దీక్ష విరమణ నిర్దేశించమైనది.. దీనిని 'ఇఫ్తార్' అంటారు. బెండు ఖర్జూరం తదితర పండ్లతో ఉపవాస దీక్ష విరమిస్తారు. ఉపవాస దీక్ష సమయంలో విధిగా నమాజులు చేయాలి. అనైతిక ధర్మవిరుద్ధమైన చర్యలకు పాల్పడకుండా ఉండాలి. అపవిత్రమైన చర్యల వల్ల ఉపవాస దీక్ష లక్ష్యం దెబ్బతింటుంది. ఉపవాస దీక్ష కేవలం ఆహారం, నీరు తీసుకోవడమేకాదు.. దీక్షాపరులు అన్ని రకాల చెడు కార్యాలు, అధర్మ పాపక్రియల నుంచి దూరంగా ఉండాల్సి ఉంటుంది. ఏ వ్యక్తి అయితే రంజాన్ నెలలో ఉపవాసం ఉంటాడో అతడు చేసిన పాపాలన్ని క్షమింపబడుతాయన్నది నమ్మకం. రంజాన్ దీక్షలు నరకాగ్ని నుంచి కాపాడుతుందని హదీస్ (ప్రవక్త ప్రవచనాల సంపుటి) చెబుతుంది. ఏ కారణం లేకుండా ఎవరైనా రంజాన్ దీక్ష తప్పితే ఆ తర్వాత వారు ఎన్ని ఉపవాసాలున్నా కోల్పోయిన దానికి సమానం కాదని ప్రగాఢ విశ్వాసం. ఉపవాసంతో ఉండి చేసే ప్రార్థనను అల్లాహ్ (దైవం) ఎప్పుడు తిరస్కరించడని చెబుతారు.

హలీం, హరీస్ రుచులు

రంజాన్ మాసంలో లభించే హలీం, హరీస్ వంటకాలకు ప్రత్యేక గుర్తింపు ఉంది. కేవలం రంజాన్ మాసంలో లభించే ఈ వంటకాలను ఆరగించడానికి కులమతాలకతీతంగా ప్రజలు ఆసక్తి కనబరుస్తారు. ఇప్పటికే వీటి తయారీకి సంబంధించిన మట్టితో కూడిన బట్టీలు సిద్ధం చేశారు. రంజాన్ తొలి ఉపవాసం సాయంత్రం నుంచి హలీం, హరీస్‌లు అందుబాటులో ఉంటాయి.


మహబూబ్‌నగర్‌లో హలీం, హరీస్ వంటకాల తయారీకి సిద్ధమైన బట్టీలు

జాతీయ కౌన్సిల్‌లో పొత్తుల నిర్ణయం

- సీపీఐ జాతీయ నాయకులు చాడ వెంకట్‌రెడ్డి, పల్లా వెంకట్‌రెడ్డి


మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి, పల్లా వెంకట్‌రెడ్డి

కొల్లాపూర్: పార్లమెంట్ ఎన్నికల్లో పొత్తుల అంశంపై ఈనెల 15న జరిగే జాతీయ కౌన్సిల్ సమావేశంలో పార్టీ నిర్ణయం తీసుకుంటుందని సీపీఐ జాతీయ నాయకులు చాడ వెంకట్‌రెడ్డి, పల్లా వెంకట్‌రెడ్డి వెల్లడించారు. కొల్లాపూర్‌కు చెందిన సీపీఐ రాష్ట్ర నాయకుడు ఎస్‌ఎండీ ఫయాజ్ తండ్రి కుతుబుద్దీన్ ఇటీవల మృతిచెందగా.. ఆ కుటుంబాన్ని సోమవారం వారు పరామర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 5 ఎంపీ సీట్లు కేటాయించాలని కాంగ్రెస్ పార్టీని అడిగామని.. ఒక్క సీటులోనైనా కచ్చితంగా పోటీచేస్తామన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో పొత్తుల మార్పు ఉంటుందన్న ప్రచారం అవాస్తవమన్నారు. ఎన్నికల పొత్తుల అంశాలు జాతీయ కౌన్సిల్ సమావేశం తర్వాతనే తేలుతాయని స్పష్టంచేశారు. అధికారంలో ఉన్న పార్టీలు ప్రతిపక్షాలు ఉండకూడదు.. అంతా ఏకపక్షంగా ఉండి, దోచుకొని తినాలని చూస్తున్నాయన్నారు. ఇది ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. వామపక్షాలు బలపడితేనే ప్రజాస్వామ్యం బలపడుతుందని వారన్నారు. రామరాజ్యం పేరుతో బీజేపీ ఓట్లడిగేందుకు ప్రయత్నిస్తోందన్నారు. ప్రజలకు ఎలాంటి కష్టాలు లేకుండా సుఖంగా జీవిస్తే రామరాజ్యం అవుతుందని.. మోదీ పాలనలో అటువంటివి ఏమీ కనబడటం లేదన్నారు. ఇదెలా రామరాజ్యం అవుతుందని వారు ప్రశ్నించారు. సంఘ్‌పరివార్ శక్తుల ఆగడాలతో లౌకికతత్వానికి విఘాతం ఏర్పడుతోందన్నారు. ప్రొఫెసర్ సాయిబాబును మహారాష్ట్ర హైకోర్టు నిర్దోషిగా ప్రకటిస్తే.. వెంటనే అక్కడి ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్లిందని.. వికలాంగుడు అనే కనికరం కూడా చూపడం లేదన్నారు. ఇటువంటి అరాచకాలను అడ్డుకునేందుకు ప్రజలు సిద్ధ కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాల్‌నర్సింహ, ఆనంద్‌జీ, ఇందిరమ్మ, లక్ష్మీపతి, శివకుమార్, లక్ష్మీనారాయణ, యూసూఫ్, డి.వెంకటస్వామి, కిరణ్‌కుమార్, వెంకటస్వామి, గోపాల్ తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు

మల్దకల్: మండలంలోని ఓ పాఠశాలలో విద్యార్థినిపై అసభ్యకరంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడిపై పోలీసులు పోక్సో కేసు నమోదుచేశారు. ఎస్‌ఐ సురేష్‌గౌడ్ వివరాల మేరకు.. 7వ తరగతి విద్యార్థినిపై ఉపాధ్యాయుడు వెంకటేష్ అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఈ విషయాన్ని సదరు విద్యార్థిని తల్లిదండ్రులకు తెలియజేయడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు ఉపాధ్యాయుడు వెంకటేష్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పొలంలో మొసలి లభ్యం



ధరూరు: మండలంలోని ర్యాలంపాడు శివారులోని వ్యవసాయపొలంలో సోమవారం మొసలి కనిపించింది. వివరాల్లోకి వెళితే.. ర్యాలంపాడుకు చెందిన రైతు రంగారెడ్డి పొలంలోని చెట్ల పొదల్లో మధ్యాహ్నం మొసలి కనిపించింది. భయాందోళనకు గురైన రైతులు విషయాన్ని జిల్లా ఫారెస్టు అధికారులకు తెలిపారు. దీంతో వారు అక్కడికి చేరుకుని దానిని ఓ వాహనంలో తరలించి జూరాల ప్రాజెక్టు రిజర్వాయర్‌లో వదిలారు. ఇటీవల ర్యాలంపాడు రిజర్వాయర్‌లో నీళ్లు ఇంకిపోవడంతో అందులో నుంచి బయటకు వచ్చినట్లు ఆ ప్రాంత రైతులు తెలిపారు.

గద్వాల కోర్టులో చోరీకి యత్నం

- రంగంలోకి క్లూస్ టీం

గద్వాల క్రైం: జిల్లాకేంద్రంలోని కోర్టు సముదాయంలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి యత్నించిన ఘటన సోమవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. కోర్టు సిబ్బంది, పోలీసుల కథనం మేరకు.. కోర్టు సముదాయంలోని జిల్లా న్యాయ సేవాసదనం, జూనియర్ కోర్టు సముదాయం తలుపులు విరగ్గొట్టడంతో పాటు న్యాయమూర్తి కారును సైతం అపహరించే ప్రయత్నం చేశారు. ఉదయం కోర్టు సముదాయానికి వచ్చిన సిబ్బంది గమనించి సంబంధిత అధికారులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. గద్వాల సీఐ భీమాకుమార్, ఎస్‌ఐ శ్రీనివాస్ ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. గృహ సముదాయం అనుకొని చోరీకి యత్నించి ఉంటారని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. లేక కోర్టులోని కీలక దస్త్రాలను అపహరించేందుకే ఇలా చేసి ఉంటారా అనే కోణంలోనూ ఆరా తీస్తున్నారు.

రంగంలోకి క్లూస్ టీం..

రంగంలోకి దిగిన క్లూస్ టీం సుమారు మూడుగంటల పాటు తలుపులు, కారుపై ఉన్న వేలిముద్రలు సేకరించింది. పాత నేరస్తులా? అంతర్రాష్ట్ర ముఠా సభ్యులా? అనే కోణంలోనూ పరిశీలించారు. జిల్లాకేంద్రంలోని సీసీ కెమెరాల్లో నిందితుల కదలికలు.. ఏ మార్గంలో కోర్టులోకి వెళ్లారు? ఎంత మంది వచ్చి ఉంటారనే అంశాలను నిశితంగా చూస్తున్నారు.

గడ్డివాము దగ్ధం

ఉండవెల్లి: మండల కేంద్రంలోని రైతు కల్లాల్లో ఏర్పాటు చేసిన గడ్డి వాము ప్రమాదవశాత్తు మంటల్లో కాలి బూడిదైంది. ఆదివారం అర్ధరాత్రి గడ్డివాములో మంటలు చెలరేగడంతో చుట్టు పక్కల ఉన్న ప్రజలు మంటలను అదుపు చేయడానికి ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. కాలిపోయిన గడ్డి విలువ దాదాపు రూ.1.20 లక్షల విలువ ఉంటుందని రైతు విఠల్ బాబు తెలిపారు. మూగజీవాలకు ఎలాంటి ప్రాణనష్టం కాలేదని పేర్కొన్నారు.

నవాబుపేట తైబజార్‌లో నకిలీ రశీదులు

పంచాయతీకి ఫిర్యాదు చేసిన వ్యాపారులు



పంచాయతీ స్టాంప్ ఉన్న చీటీ



స్టాంప్ లేని తైబజార్ చీటీ

నవాబుపేట: మండల కేంద్రంలో తైబజార్ వసూలులో రెండు రశీదుల విషయం బయటపడింది. మార్కెట్‌లో చలామణిలో ఉన్న రశీదులలో దీంతో ఏది నకిలీనో తెలియక వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. గతేడాది తైబజార్‌ను రూ.9.78 లక్షలకు సంపంగి ఆంజనేయులు వేలంలో దక్కించుకున్నారు. మరో 24 రోజుల్లో గడువు పూర్తి కావస్తుండటంతో మండల కేంద్రంలో రెండు రశీదులు దర్శనం ఇచ్చాయి. దీంతో ఎవరైనా నకిలీ రశీదు వాడుతున్నారన్న అనుమానంతో వ్యాపారులు పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో టెండర్ పొందిన వ్యక్తికి సంబంధించిన రశీదుపై పంచాయతీ స్టాంపును వేసి వీటితోనే తైబజార్ వసూలు చేయాలని సూచించారు. కాగా మార్కెట్‌లో రెండు రకాల తైబజార్ రశీదుల చలామణిపై అధికారులు విచారణ చేయాలని కోరుతున్నారు.

❐ గత ఏడాది తైబజార్ పొందిన వ్యక్తి ఇప్పటి వరకు మొత్తం రూ.9.78లక్షలు చెల్లించాడని పంచాయతీ కార్యదర్శి నరేష్ వివరించారు. మార్కెట్‌లో ఒకటే తైబజార్ రశీదు ఉంటుందని ఎవరైన నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. గతంలో తైబజార్ పొందిన వ్యక్తి వసూళ్ల కోసం ప్రైవేట్ వ్యక్తిని నియమించినట్లు సమాచారం. ఇద్దరి మధ్య వచ్చిన విభేదాల కారణంగా రెండు రశీదుల వ్యవహారం మార్కెట్‌లో వచ్చుంటుందని కార్యదర్శి అనుమానం వ్యక్తం చేశారు. నకిలీ రశీదులతో వసూలు చేస్తున్నట్లు తైబజార్ యజమాని ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

యువకుడు బలవన్మరణం

- వేధింపులే కారణమని మృతదేహంతో ఆందోళన
- పగిడ్యాల్‌లో ఉద్రిక్తత, పోలీసుల మోహరింపు


రామాంజనేయులు (ఫైల్)


కృష్ణారెడ్డి ఇంటి వద్ద ఆందోళన చేస్తున్న కుటుంబసభ్యులు

గండేడ్/మహమ్మదాబాద్: యజమాని వేధింపుల కారణంగా యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడని బాధిత కుటుంబ సభ్యులు ఆందోళన చేపట్టారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా.. బంటు వెంకటమ్మ, సత్యయ్యలకు నలుగురు సంతానం. వారిలో ముగ్గురు ఆడపిల్లలు కాగా రామాంజనేయులు (18) కుమారుడు ఉన్నాడు. కుమార్తెలకు వివాహాలు కాగా రామాంజనేయులు పాఠశాలకు వెళ్లడం మానేసి 8ఏళ్లుగా అదే గ్రామానికి చెందిన అన్నసారం కృష్ణారెడ్డి వద్ద బోరుబండిపై కూలీగా పనిచేస్తున్నాడు. పది రోజుల కిందట బోరు బండిలో డీజిల్ దొంగతనం చేస్తున్నాడని పనిలోంచి తీసేశారు. తర్వాత డీజిల్ ఎప్పుడెప్పుడు తీశారని కృష్ణారెడ్డితో పాటు అతని తమ్ముడు మన్యపురెడ్డి వేధించినట్లు తల్లి వెంకటమ్మ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో అవమానానికి గురైన రామాంజనేయులు ఆదివారం ఉదయం గడ్డి మందు తాగాడు. అతన్ని చికిత్స నిమిత్తం మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో సోమవారం ఉదయం మృతి చెందాడు.

మృతదేహంతో ఆందోళన

పోస్టుమార్టం అనంతరం బంధువులు, గ్రామస్తులు కలిసి మృతదేహాన్ని నేరుగా రామాంజనేయులు మృతికి కారణంగా భావిస్తున్న కృష్ణారెడ్డి ఇంటికి తరలించారు. మృతదేహాన్ని ఇంటి లోపలికి తీసుకెళ్లడానికి యత్నించగా అక్కడే ఉన్న పోలీసులు అడ్డుకున్నారు. అయినా వారు బలవంతంగా మృతదేహాన్ని ఇంటిలోపలికి తీసుకెళ్లి పెట్టారు. అనంతరం ఇంటి వద్ద ఆందోళనకు దిగారు. అంబేద్కర్ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బోరుకృష్ణయ్య బాధితులకు మద్దతు పలికారు. కుటుంబానికి న్యాయం చేయాలని, అందుకు కారణమైన వారిని వెంటనే అరెస్టు చేయాలని, లేదంటే మృతదేహాన్ని ఇంటి ఎదుటే ఖననం చేస్తామని పట్టుబట్టారు. అంతకుముందే అక్కడికి చేరుకున్న మహమ్మదాబాద్ ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి బాధితులతో మాట్లాడినా వారు వినిపించుకోలేదు. వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపే వరకు వెళ్లేదిలేదని పట్టుబట్టారు. పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో సీఐలు గాంధీనాయక్, స్వామి,కోయిల్‌కొండ ఎస్‌ఐ, హన్వాడ పోలీసు సిబ్బంది గ్రామానికి చేరుకున్నారు. కృష్ణారెడ్డి తమ్ముడు మన్యపురెడ్డి పక్కనే ఓ ఇంట్లో దాక్కున్నట్లు సమాచారం తెలియడంతో పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు. కృష్ణారెడ్డిని అరెస్టు చేస్తామని సీఐ గాంధీనాయక్ మృతుడి తల్లిదండ్రులకు హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు. రాత్రి 9గంటలకు మృతదేహాన్ని అంత్యక్రియల నిమిత్తం తీసుకెళ్లారు.

రెండ్రోజుల వేతనం నిలిపివేయండి

- నారాయణపేట కలెక్టర్ కోయ శ్రీహర్ష


పుర కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

నారాయణపేట: జిల్లాకేంద్రంలోని పుర కార్యాలయాన్ని సోమవారం ఉదయం 10.30 గంటలకు కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ సమయంలో కార్యాలయంలో ఒకరిద్దరు ఔట్ సోర్సింగ్ సిబ్బంది, అటెండర్లు మినహా అధికారులు, ఉద్యోగులు ఎవరూ లేకపోవడంతో హాజరు రిజిస్టర్‌తో పాటు బయోమెట్రిక్ యంత్రాన్ని పరిశీలించారు. బయోమెట్రిక్ హాజరు ప్రింట్ తీసి తనకు పంపించాలని అక్కడున్న ఉద్యోగిని ఆదేశించారు. ముందస్తు సమాచారం లేకుండా కార్యాలయానికి సకాలంలో హాజరుకాని అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి రెండురోజుల వేతనం నిలిపివేయాలని ఆదేశించారు. అలాగే కార్యాలయంలో ఏర్పాటుచేసిన ప్రజాపాలన ప్రత్యేక కౌంటర్‌ను ఎవరు నిర్వహిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. కార్యాలయంలోని అన్ని విభాగాలను పరిశీలించి ఎవరెవరు ఏయే విధులు నిర్వర్తిస్తున్నారని ఆరా తీశారు. పుర కమిషనర్ సునీత 13వ తేదీ వరకు సెలవులో ఉన్నట్లు అక్కడి సిబ్బంది తెలిపారు. అంతకుముందు పుర కార్యాలయం ఎదుట ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. ఎంత మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని ప్రిన్సిపాల్‌ను అడిగి తెలుసుకున్నారు.

పేలిన జిలిటెన్ స్టిక్స్

- బాలుడికి తీవ్రగాయాలు

లింగాల: జిలిటెన్ స్టిక్స్ పేలిన ప్రమాదంలో ఓ బాలుడికి తీవ్రగాయాలైన ఘటన లింగాల మండలం అప్పాయపల్లిలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. అప్పాయపల్లికి చెందిన ఏడేళ్ల ధనుష్‌కు గ్రామంలో రెండు జిలిటెన్ స్టిక్స్ దొరికాయి. వాటితో ఆడుకుంటున్న క్రమంలో పేలుడు సంభవించింది. ప్రమాదంలో బాలుడికి తీవ్రగాయాలు కావడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం లింగాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి రెఫర్ చేశారు. ప్రస్తుతం బాలుడికి ఎలాంటి ప్రాణాపాయం లేదని తెలిసింది. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.